ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 10 ఫిబ్రవరి 2025



ప్రజల సొమ్ము.. పెద్దలకు పందేరం..

- జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలుకు రూ.824.41 కోట్లా?
- లే- అవుట్ ప్రాంతాలు ముందుగానే లీక్
- ప్రణాళిక ప్రకారం భూములు చవకగా కొనుగోలు
- జిల్లాలో 625 లే అవుట్లలో 1,16,940 ప్లాట్లు

జగన్ సర్కారులో భూ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తాము చెప్పిందే వేదం అన్నట్లుగా సాగిన పాలనలో అధికారులు, వైసీపీ నేతలు ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్నారు. జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో జిల్లాలో భూ స్కాంకు తెర లేపారు. జిల్లాలో లక్ష మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలంటూ చేసిన ప్రకటనలు వైసీపీ పెద్దలకు కల్పతరువైంది. ఇంకేముందీ పేదల భూములపై కన్నుపడింది. తహసీల్దార్ల లీక్‌లతో వ్యూహాత్మకంగా కారు చవకగా భూములు కొల్లగొట్టే కుట్రలో సఫలమయ్యారు. అయితే ప్రస్తుతం కూటమి సర్కార్ పేదల ఇళ్ల స్థలాల పేరిట జరిగిన భూ దందాను సీరియస్‌గా తీసుకుంది. ఇందులో ఎవరి పాత్ర ఎంత అని వెలికితీసే పనిలో పడింది. దీంతో అప్పట్లో జిల్లాలో పనిచేసిన అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలోని 625 లేఅవుట్లలో సెంటు, సెంటున్నర చొప్పున పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు అధికారులు భూములు కొనుగోలు చేశారు. ఆ భూముల్లో 1,16,940 మంది పేదలకు ప్లాట్లు వేశారు. అయితే జగనన్న ఇళ్ల స్థలాలు.. వైసీపీ నేతలకు వరంలా మారాయి. కాలనీలు ఏర్పాటు చేస్తారనే విషయం ముందే తెలుసుకుని కారుచౌకగా భూములు కొనుగోలు చేసి కోట్లు సంపాదించారు. ఎకరం ధర రూ.5-10 లక్షలు పలకడమే గగనంగా ఉన్న భూములను రాత్రికి రాత్రే పేదలకు పదో, పరకో ముట్టజెప్పి పేదల భూములను కాజేశారు. ఈ విషయంలో రెవెన్యూశాఖ పక్కా ప్రణాళికతో సహకరించిందనేది జగమెరిగిన సత్యం.

జగన్ రాకతో రియల్ ఎస్టేట్ పుంజుకుంటోందని ఆర్భాటపు ప్రచారాలతో హోరెత్తించారు. తీరా చూస్తే జగనన్న కాలనీలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో ఆ భూములు పెద్దలకు చేరిందే తడవు అధికారులు ఎకరాకు రూ.35 నుంచి 36 లక్షల వరకు ధరలు నిర్ణయించి ప్రభుత్వ సొమ్ము ఉదాసీనంగా కోట్లాది రూపాయిలతో వైసీపీ నేతల జేబులు నింపినట్లు సమాచారం. ఏళ్ల తరబడి ఆ పొలాలే జీవనాధారంగా బతికిన పేద రైతులకు మేలు జరిగే చివరి క్షణంలో నేతల ఎత్తుగడలు, చిట్కాలకు రైతులు దగా పడ్డారని లబోదిబో మంటున్నారు. జిల్లాలో 36 మండలాల్లో ఇదే ప్రక్రియ సాగింది. జిల్లాలో 2747.8 ఎకరాల ప్రభుత్వ భూములు, మరో 591.92 ఎకరాల భూములు ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించారు. మొత్తం 3339.72 ఎకరాల కొనుగోలుకు అక్షరాల ప్రజాధనం రూ.824.47 కోట్లు ట్రిపుల్ ధమాకాగా పంచారు. అంటే బహిరంగ మార్కెట్ విలువ లెక్కల్లో అంతకు అంతా పెంచిన రూ.4 వందల కోట్లకు మించదు. కానీ పేదలకు ఇళ్ల స్థలాల మాటున మరో 4 వందల కోట్లు ప్రజాధనం వైసీపీ నేతలకు పంచడంలో అప్పట్లో జిల్లా అధికార యంత్రాంగం జూ హుజూర్ పాలనకు నిదర్శనమనే విమర్శలు ఉన్నాయి.

ప్రణాళిక ప్రకారమే కాలనీల ఏర్పాటు లీక్‌లు

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ రాజధాని దొనకొండలో నిర్మిస్తున్నారనే ప్రచారం సాగింది. దీంతో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నేతలు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములను పెద్ద ఎత్తున కొనుగోలుకు క్యూ కట్టిన విషయం విదితమే. ప్రజా అవసరాలకు అనుగుణంగా రాజధానిని అమరావతికి మార్చడంతో బొక్కబోర్ల తప్పలేదు. కానీ జిల్లాలో జగనన్న కాలనీల ఏర్పాటు చేసే ప్రాంతాలను ప్రణాళిక ప్రకారం 6నెలల ముందే రెవెన్యూకు సమాచారం లీకు అందింది. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను మ్యాపులు పెట్టి వెతికారు. కాలనీలు కట్టబోయే ప్రాంతాల సమాచారం వైసీపీ పెద్దల చేతుల్లో తహశీల్దార్లు పెట్టడం ఈ భూ స్కాంకు ఆజ్యం పోసినట్లైంది. ఇక పోతే జగన్ పాలన ఆరంభం నుంచే పేదల భూముల ఆక్రమణలు, దాడులు, బెదిరింపులతో రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు స్థిరాస్తుల భద్రతకు ఆందోళన చెందాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో ఏళ్ల తరబడి అమ్మకాలు సాగక, ఏడాదికి ఒక పంట పండడం గగనం అంటూ విసిగిపోయిన రైతులకు జగనన్న కాలనీల విషయం తెలీక గ్రామ శివారు భూముల అమ్మకాలకు అసక్తి చూపక తప్పలేదంటారు. ఇంకే ముంది రాత్రికి రాత్రే ఎకరా భూమి రూ-5-10 లక్షలకు దళారులను రంగంలోకి దింపి కారు చవకగా కొట్టేశారు. కడప, కార్పొరేషన్, ప్రొద్దుటూరు తదితర మున్సిపాలిటీల్లో మందస్తుగా కొన్న భూములను ఎకరా భూమి ధర రూ.35 లక్షల నుంచి 36 లక్షల వరకు ప్రభుత్వానికి అమ్మి పేదల ఇళ్ల స్థలాలకు తక్కువ ధరలకు ఇచ్చినట్లు బాగా ప్రచారం సాగించారు. దీని వెనుక పెద్దల భూకుంభ కోణం సాగిందంటారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలోని 625 లేఅవుట్లలో సెంటు, సెంటున్నర లెక్కల్లో కొనుగోలు చేసిన భూముల్లో 11,6940 మంది పేదలకు ప్లాట్లు వేయడం గమనార్హం.

591.92 ఎకరాల పట్టా భూములకు రూ.206.47 కోట్లు

జగనన్న కాలనీల పేరిట జిల్లాలో 3339.72 ఎకరాలు కొనగా అందులో 6 ప్రాంతాల్లో పట్టాభూములు కొన్నారు. యర్రగుంట్లలో 25.39 ఎకరాలు, తొండూరులో 6-18 ఎకరాలు, ప్రొద్దుటూరులో 444.11 ఎకరాలు, పెద్దముడియంలో 1.6 ఎకరాలు, కడపలో 111.19 ఎకరాలు, చక్రాయపేటలో 3.45 ఎకరాలు చొప్పున మొత్తం 591.92 ఎకరాలకు కలిపి రూ.206.47 కోట్లు ప్రభుత్వం పట్టాదారులకు చెల్లించింది. కడప, ప్రొద్దుటూరుతో పాటు మిగతా 4 ప్రాంతాల్లో ఈ భూముల ధరలు ఎకరం ధర రూ.10 లక్షలకు మించదంటారు. కానీ ప్రభుత్వ పెద్దలు, అధికారులు కుమ్మక్కై ట్రిపుల్ ధమాకాగా ప్యాకేజీ ప్రకటించడం వెనుక వైసీపీ నేతలు దోచుకున్న సొమ్ము అంచనా వేయవచ్చు. ఇక ప్రభుత్వ భూముల విషయానికి వస్తే 2747.833 ఎకరాలు సేకరించారు. ఇందుకు గానూ రైతుల పేరుతో రూ.617.938 కోట్లు పంచారు. అందులో ఎకరం ధర సగటున రూ.22 లక్షలకు హెచ్చించి పేదలపై ప్రేమ వలక బోశారు. తీరా చూస్తే ఈ భూములన్నీ కూడా జగనన్న కాలనీలు ఏర్పాటు కాక ముందే ప్రణాళిక ప్రకారం వైసీపీ పెద్దల చేతుల్లో ఉండడంతో సొమ్మొకరిది... సోకొకరిది అన్నట్లుగా పేద రైతుల నోట్లో దుమ్ము కొట్టారు. అప్పటి సర్కారు ప్రజాధనాన్ని భారీగా పందేరం చేసినప్పటికీ 625 లే అవుట్లలో 1,16,940 ప్లాట్లలో ఐదేళ్ల పాలనలో ఎంత వత్తిడి చేసి వందల కోట్లు ఖర్చు చేసినా పేదలకు కట్టించిన ఇళ్లు జిల్లాలో 34 వేలకు మించలేదు. అంటే ఆ భూములు కొండలు, గుట్టలు, వంకలు, ఊరి పొలిమేర్లలో ప్రజాజీవనానికి, సౌకర్యాలకు బారెడంత దూరం ఉండడమే కారణమంటారు.





సభనుద్దేశించి ప్రసంగిస్తున్న ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు



సమాజ రుగ్మతలపై కలం ఎక్కుపెట్టాలి

- రెండు రోజుల ముగింపుసభలో ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు

కడప కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వేళ్లూనుకున్న రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివృద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై వుందని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం-రాయలసీమ భాగస్వామ్యం అనే అంశంపై నగర ఐఎంఏ హాలులో గత రెండు రోజులుగా 2వ సాహిత్య సాంస్కృతిక మహాసభలు జరిగాయి. అందులో భాగంగా ఆదివారం ముగింపు సభ కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా వెలుదండ నిత్యానందరావు హాజరై ప్రసంగించారు. సాహిత్య సంఘాలు ప్రజలలో సాహితీ పిపాసను పెంచాలని, ప్రాంతీయ అభివృద్ధి నిమిత్తం చైతన్య స్పృహ రేకెత్తించాల్సిన అవసరం వుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా రెండు రోజులపాటు మహాసభలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రాయలసీమకు చెందిన భాష, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి అంశాలపై అనేక పరిశోధన పత్రాలు సదస్సుల ద్వారా వెలుగు చూశాయన్నారు. సంఘం గౌరవ సలహాదారుడు అలపర్తి పిచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పేరుకు రాయలసీమ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి కవులు, కళాకారులు పాల్గొని సీమ ఘనతను చాటడం హర్షణీయమన్నారు. సంఘం కోశాధికారి కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి స్వాగతం పలుకగా సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు.

డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి సభావేదికపై..

ఉదయం జరిగిన ఈ సదస్సుకు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ మోరగుడి వేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో తెలుగు సాహిత్య విమర్శ వికాసం-రాయలసీమ కృషి అనే అంశంపై డాక్టర్ విజయభాస్కర్, రాయలసీమ సాహిత్యం-రాయలసీమ భాష అనే అంశంపై డాక్టర్ చింతకుంట శివారెడ్డి, రాయలసీమ జానపద సాహిత్యం అనే అంశంపై డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పత్ర సమర్పణ చేశారు.

రాజగోపాలనాయుడు సభావేదికపై..

ఈ సదస్సుకు రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అధ్యక్షత వహించగా పోతన సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా, ఆత్మీయ అతిథిగా ప్రముఖ రచయిత కె.వి.రమణారెడ్డి పాల్గొన్నారు. ఇందులో రాయలసీమ స్త్రీవాద సాహిత్యం అనే అంశంపై డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, రాయలసీమ నాటక సాహిత్యంపై కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, రాయలసీమ అవధాన సాహిత్యం అనే అంశంపై ఆముదాల మురళి, రాయలసీమ బాలసాహిత్యం అనే అంశంపై డి.కె.చదువులబాబు పత్రసమర్పణ చేశారు.

నీలం సంజీవరెడ్డి సభావేదికపై..

ఈ కవి సమ్మేళనానికి గోసుల వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా బాబుల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో శతాధిక కవి సమ్మేళనంలో కవులు కవితాగానం చేశారు. సంఘం కార్యదర్శి డాక్టర్‌భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సభా సమన్వయం చేశారు.

బుడ్డా వెంగల్‌రెడ్డి సభా వేదికపై..

ఈ సదస్సుకు ఎల్.వివేకానందరెడ్డి అధ్యక్షత వహించగా పల్లా కృష్ణ ముఖ్య అతిథిగా, ఆత్మీయ అతిథులుగా ఎం.శివగణపతి, దర్పణం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఇందులో రాయలసీమ పత్రికారంగంపై టి.సురేష్‌బాబు, రాయలసీమ సినిమాపై బి.స్వరూపారాణి, రాయలసీమ సంస్కృతి, సంప్రదాయాలు అనే అంశంపై పి.ఓబులేసు, పత్రాలు సమర్పించారు. అనంతరం వేమన, సుమతి, భాస్కర శతకాలలో పద్యపఠన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



భూ ఆక్రమణలను ఉపేక్షించం

- ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకోండి
- మున్సిపాలిటీ స్టేడియానికి 5 ఎకరాలు స్థలం గుర్తించాలి
- అధికారులకు ఇన్‌చార్జి మంత్రి సవిత ఆదేశాలు

బద్వేలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణల జోలికి వెళ్తే ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు.. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి.. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని బద్వేలు, గోపవరం తహశీల్దార్లు ఉదయభాస్కర్, త్రిభువన్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, అధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అడ్డంగా కబ్జా చేయడం నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు వెళుతూ బద్వేలులోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఇంట్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌రెడ్డిలతో కలిసి బద్వేలు, గోపవరం, మున్సిపల్ కమిషనర్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని, ఆక్రమణల విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించాల్సిన అవసరం లేదన్నారు. ఆక్రమణలను అరికట్టడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా బద్వేలు మున్సిపాలిటీ స్టేడియానికి 5 ఎకరాల స్థలం గుర్తించాలని, మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే కొన్నేళ్లుగా బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు మున్సిపాలిటీకి తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని, మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, నీటి ఎద్దడి ఏర్పడకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు.

స్వయంకృతాపరాధమే ఓటమికి కారణం

- ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్ అనే నినాదంతో దాదాపు పుష్కరకాలం క్రితం దేశ రాజకీయాలను శాసించిన ఆమ్ ఆద్మీ పార్టీ అదే కరప్షన్‌లో నిండా కూరుకొని పోయి ప్రజా విశ్వాసం కోల్పోయింది. అరవింద్ కేజ్రీవాల్‌తో సహా ఆ పార్టీ కీలక నేతలు పరాజయం పాలవడం వారి స్వయంకృతాపరాధమేనని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీని గత దశాబ్దకాలంగా వాయు కాలుష్యమే కాదు రాజకీయ కాలుష్యం పట్టిపీడిస్తూ వచ్చిందని, ఆప్ ప్రభుత్వం మొదట్లో ఎన్ని మంచి పనులు చేసినా రాష్ట్రంలో దీర్ఘకాలిక ఫలితాలు అందించే కార్యక్రమాలు చేపట్టలేదని తెలిపారు. దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ) సగటున 7.5 శాతం ఉంటే దేశ రాజధాని ఢిల్లీ జీడీపీ 7.2 శాతం మేర కంటే ఎన్నడూ దాటకపోవడం ఆప్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టిందన్నారు. ఢిల్లీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఓ గుణపాఠం నేర్పిందని, పార్టీల మధ్య రాజకీయ వైరుధ్యాలు ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో కేంద్రం, రాష్ట్రం సహకారం అందించుకోకపోతే ఆ పార్టీలను ప్రజలు దూరం చేస్తారనేది స్పష్టమైందని తెలిపారు. సిద్ధాంతాలు చెప్పేవారు వాటికి భిన్నంగా నడిచి అవినీతికి పాల్పడితే ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి, జీవన ప్రమాణాలే కోరుకుంటారని, సెంటిమెంట్ ఆధారంగా ఓట్లు వేయరని కూడా ఈ ఎన్నికలు స్పష్టం చేశాయని వివరించారు. సంక్షేమంతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా జరిగే సుస్థిర అభివృద్ధి ఒక్కటే ఎన్నికల్లో గెలుపునకు దోహదం చేస్తుందని ప్రజలు నిరూపించారని తెలిపారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- కేంద్రాలు 78, విద్యార్థులు 14,508
- ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటసుబ్బయ్య

7



మరియతల్లి... త్యాగశీలి

- నవదిన ప్రార్థనలో ఫాదర్ బెన్ని

కడప కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచంలో ప్రతిఒక్కరినీ తన బిడ్డలుగా భావించిన మరియతల్లి గొప్ప త్యాగశీలి అని ఎస్‌వీడీ ఫాదర్ బెన్ని కొనియాడారు. మరియాపురం లూర్దుమాత నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం స్థానిక పాతచర్చి ఆవరణంలో జరిగిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విశ్వాసులనుద్దేశించి దైవసందేశం ఇచ్చారు. యేసు ప్రేమ అద్వితీయమని, ప్రజలంతా ఆయన వాక్కును ఆలకించి మంచి మార్గంలో నడవాలన్నారు. జాలి, దయ, ప్రేమ, కనికరం, నిగ్రహంతో జీవిస్తే శాంతి నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా లూర్దుమాత స్వరూపాన్ని తేరుపై మరియాపురం పురవీధుల్లో ప్రదక్షిణ చేస్తూ క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో దివ్యబలిపూజ కార్యక్రమాన్ని ఫాదర్ సురేష్ నిర్వహించారు. కాగా తిరుణాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలో మరియతల్లి తేరు ప్రదక్షిణ జరగనుంది. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు, కన్యస్త్రీలు, ప్రజలు పాల్గొన్నారు.





దైవ సందేశం చేస్తున్న ఫాదర్ బెన్ని.. హాజరైన విశ్వాసులు

ఆరోగ్యం.. ఆహ్లాదం..

- అంగన్వాడీ కేంద్రాల్లో పెరటి తోటలు
- 720 కేంద్రాల్లో పోషణ వాటిక అమలు
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు



సీకెదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెలో సాగు చేసిన పెరటి తోట



వేంపల్లె గరుగువీధి అంగన్వాడీ కేంద్రంలోని పోషణవాటికను పరిశీలిస్తున్న సీడీపీఓ సునీత

ఆహ్లాదకర వాతావరణం తీసుకొస్తున్నాం..



సాక్ష్యం కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక ఏర్పాటు చేసి ఒక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొస్తున్నాం. అంతేకాకుండా తాజా కూరగాయలు, ఆకుకూరలతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. బాల సంజీవిని కిట్లను తల్లులకు ఇవ్వడమే కాకుండా హైరిస్కు తల్లులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

- శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధికి నోచుకోలేదు. పసిపిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే చిక్కీలు, పాల ప్యాకెట్లపై జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకోవడం మినహాయిస్తే అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి, వారి ఆరోగ్యానికి అదనంగా చేసిందేమీ లేదనేది స్పష్టం అవుతోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోషకాహారంతో పాటు తాజా కూరగాయలతో ఆహార పదార్థాలు అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలను పచ్చదనంతో నింపుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించడమే కాకుండా ఆరోగ్యం ఆనందకరమైన బాల్యానికి చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాక్ష్యం' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పలుచోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ కేంద్రాల్లో పోషణ వాటికలతో పాటు మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, చిన్నారులకు ఆటవస్తువులు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో చిన్నారులు బడివైపు ఆకర్షితులవుతున్నారు. జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 2002 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు, 177 మినీ అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 1068 కేంద్రాలు సొంత భవనాల్లో ఉండగా 916 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మరో 45 అంగన్వాడీ కేంద్రాలు అద్దె లేని పాఠశాల ప్రాంగణాల్లో నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 11,267 మంది గర్భిణీలు, 12,821 మంది బాలింతలకు బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, కోడిగుడ్లు ఇస్తున్నారు. అదేవిధంగా మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు వయస్సున 56,340 మంది పిల్లలకు ఒకపూట సంపూర్ణ భోజనం వండి వడ్డిస్తున్నారు. బాల సంజీవనీలో భాగంగా రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, 20 గ్రాముల ఎండు ఖర్జూరాలు, 250 గ్రాముల వేరుశనగ అచ్చులు ఇస్తున్నారు.

720 కేంద్రాల్లో పోషణ వాటికలు

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనం ఉండే 720 కేంద్రాల్లో పోషక కూరల పెంపకం చేపడుతున్నారు. పోషణ వాటిక కింద ఒక్కో అంగన్వాడీ కేంద్రానికి పదివేల రూపాయలు ప్రభుత్వం కేటాయిస్తుంది. కేంద్రం వద్ద స్థలం అందుబాటులో ఉంటే సేంద్రీయ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించి వాడుకునేలా చర్యలు చేపడుతున్నారు. స్థలం లేని కేంద్రాలకు స్థలం ఉండే కేంద్రాల వద్ద పండించిన ఆకుకూరలు, కూరగాయలను సరఫరా చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పోషణ వాటికలతో పాటు రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 720 అంగన్వాడీ కేంద్రాలను సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాలుగా మార్చారు. 63 కేంద్రాలకు ఎల్‌ఈడీ, 183 కేంద్రాలకు నీటి శుద్ధి యంత్రాలు, వివిధ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

స్త్రీ శిశు సంక్షేమ శాఖ సొంత భవనాల్లో సౌకర్యాల పెంపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు మంజూరవుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 1, 2 ఆర్ఐడీఎఫ్, మనబడి మన భవిష్యత్తు అనే కార్యక్రమాల ద్వారా మంజూరైన నిధులతో 21 అంగన్వాడీ భవనాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రీ ప్రైమరీ విద్యను మరింత సమర్థవంతంగా అందించాలని, ప్రత్యేక దృష్టి సారించి సాంకేతికంగా మేళవించి ప్రతిష్ఠాత్మక ప్రణాళికతో లక్ష్యాలను చేరుకునే చర్యలు చేపట్టి సమాచారాన్ని బాల సంజీవిని యాప్ ద్వారా నిక్షిప్తం చేసి మొత్తం సమాచారం పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 2389 అంగన్వాడీ కేంద్రాలకు స్మార్ట్‌ఫోన్‌లను అందించి మరింత మెరుగైన సేవలకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేక టీచర్లు ఆయాలతో పాటు కేంద్రానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడేవారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్లు లేని 378 అంగన్వాడీ కేంద్రాలకు ఒక కేంద్రానికి రూ.36 వేల చొప్పున రూ.1,36,08,000 మంజూరు చేశారు. అదేవిధంగా తాగునీటి సదుపాయాల కల్పనకు 548 అంగన్వాడీ కేంద్రాలలో ఒక్కో కేంద్రానికి రూ.17 వేల చొప్పున రూ.93.16 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పనులు వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయి.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- కేంద్రాలు 78, విద్యార్థులు 14,508
- ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పర్యవేక్షణలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ నేరుగా జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు అనుసంధానమై ఉంటాయని, ఉన్నత స్థాయిలో నిర్వహణను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. 19వ తేదీ వరకు షెడ్యూల్ ఉంది. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాగా జనరల్ 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 14508 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

సొంత కళాశాలల్లోనే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలులో లేదు. మూడేళ్ల క్రితమే తొలగించారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు రాస్తారు. తక్కువ విద్యార్థులున్న కళాశాలలను సమీపంలోని వాటితో కలిపి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఐఓ కన్వీనరుగా డీఈసీ కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు ప్రత్యేకాధికారిగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పర్యవేక్షించనున్నారన్నారు.

గంట ముందుగా ప్రశ్నపత్రం

ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షణాధికారికి గంట ముందుగా ప్రశ్నాపత్రం బోర్డు నుంచి వస్తుంది. డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసి విద్యార్థులకు అందిస్తారు. ప్రయోగ పరీక్ష 30 మార్కులకు ఉంటుంది. ఇందులో విద్యార్థికి 11 మార్కులు (35 శాతం) రావాలి. కేంద్రానికో సీఎస్‌ను ఇప్పటికే నియమించారు. జనరల్ పరీక్షలకు సబ్జెక్టు ఎగ్జామినర్లకు సీనియారిటీ ప్రాతిపదికన బోర్డు నుంచి నేరుగా ఉత్తర్వులు వస్తాయి. కేంద్రాల్లో ప్రతి విడతకు సీఎస్‌లు మారతారు. మూడు రోజులకొకసారి ఎగ్జామినర్లను మార్పు చేస్తారు.

కుమ్మరపల్లెలో విషాదం

- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- కంటనీరు తెప్పించిన ఘటన

ములకలచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అభం...శుభం తెలియని చిన్నారుల మృతదేహాలను చూసి కుమ్మరపల్లె బోరుమంది. ములకలచెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, ఇద్దరు పిల్లల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. బి.కొత్తకోట మండలంలో వారి అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలంకు చెందిన సోమశేఖర్ కుటుంబం తొలుత బి.కొత్తకోట మండం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో కొన్నేళ్ల పాటు నివాసముంది. తరువాత కూలీ పనుల కోసం మదనపల్లెకు వలస వెళ్ళింది. దీంతో అంత్యక్రియలను ఇక్కడ నిర్వహించారు. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశేఖర్, ఆయన ఐదేళ్ల కుమారుడు రెడ్డిశేఖర్, మూడేళ్ల కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమశేఖర్, మూడేళ్ళ చిన్నారి సిద్దేశ్వరి మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తిరుపతి రూయాలో చికిత్స పొందుతూ మృతి చెందిన రెడ్డిశేఖర్ మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి



సోమశేఖర్, చినారులు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి (ఫైల్)

మదనపల్లెకు తీసుకొచ్చారు. మదనపల్లె నుంచి ముగ్గురు మృతదేహాలను బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెకు తరలించారు. బాలుడు, చిన్నారి మృతదేహాలను చూసిన కుమ్మరపల్లె కంటతడి పెట్టుకుంది. అయ్యో..పాపం చిన్నారులకు అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా అంటూ బంధువులు, గ్రామస్థులు బోరున విలపించారు. ముగ్గురి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య బంధువులు పూర్తి చేశారు.

పాపం...కవిత

ఐచర్ వాహనం నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లెకు చెందిన సోమశేఖర్, కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందడం, అలాగే సోమశేఖర్ భార్య కవిత కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రూయాలో చికిత్సలు పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇంత వరకు ఆమె స్పృహలోకి రాలేదు. భర్త సోమశేఖర్, కన్న బిడ్డలు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరిలు మృతి చెందారన్న విషయం తెలియజేయడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కవితకు భర్త, ఇద్దరు పిల్లల చివరి చూపు లేకుండా పోయింది. కవిత పరిస్థితిని చూసి బంధువులు కంటనీరు పెట్టుకుంటున్నారు. ఇలాంటి కష్టం పగవారికి కూడా రాకూడదని అంటున్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సయ్యద్ ఖాదర్‌బాషా

కడప క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పరిధిలోని ప్రకాశ్ నగర్ మసీదు వెనక వైపు నివాసం ఉంటున్న సయ్యద్ ఖాదర్ బాషా (50) అనే వ్యక్తి ఈ నెల 6వతేదీ నుంచి కనబడడంలేదని అతని భార్య సయ్యద్ గౌసియా చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సయ్యద్‌ఖాదర్‌బాషాకు మతిస్థిమితంలేదని, తన భార్య ఇంట్లో లేని సమయంలో ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపారు. ఆ మేరకు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సయ్యద్‌ఖాదర్‌బాషా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు పోలీసుస్టేషన్ సీఐ సెల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 9121100522 అనే నెంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యకి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో వెలుగుచూసింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలంలోని ముదివేడు పంచాయతీ పడమటి హరిజన వాడకు చెందిన క్రిష్ణప్ప(52) కూలి పనులు చేసుకుంటూ జీవనం జీవనం సాగిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి ముదివేడుకు వచ్చి అక్కడ మధ్యం తాగి ఇంటికి కూతవేటు దూరంలో పొలంలో పడిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు పక్కల వెతికారు. ఉదయం గ్రామస్థులు కొందరు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా అతడిపై గాయాలుండటంతో పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. అతడిని ఎవరైన చంపారా? లేక కుక్కలు అతడిపై దాడి చేయడంతో మృతి చెందాడో? తెలియడం లేదు. కాగా మృతి చెందిన వ్యక్తికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్నకు వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరణ



టీటీడీ అధికారులకు వెండి లక్ష్మీ కాసుల హారాన్ని అందచేస్తున్న దాత

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామికి కోసువారిపల్లెకు చెందిన దాత వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరించారు. కోసువారిపల్లె పంచాయతీ దిగువముట్రవారిపల్లెకు చెందిన బి.మల్లికార్జున రెడ్డి (శ్రీకృష్ణ చైతన్య నర్సింగ్ కాలేజి మదనపల్లె అధినేత) కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రూ.3 లక్షల విలువ గల బంగారు తాపడం వేసిన 2.45 కిలోల వెండి లక్ష్మీ కాసుల హారాన్ని ఆదివారం ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, విజిలెన్స్ అధికారి బాలప్రసాదరెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా దాతకు టీటీడీ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందచేశారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లక్కినేని కిరణ్ (40) అనే వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడని పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన కిరణ్ ప్రస్తుతం పోరుమామిళ్లలోని కొత్తవీధిలో నివాసం ఉంటున్నాడని, 8వతేదీ రాత్రి 11గంటలకు మద్యం మత్తులో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలియని వారి వాహనం ఎక్కరాదు

- ఒకరి అరెస్టు



పట్టుబడిన నిందితుడు, మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలియని వారి ద్విచక్ర వాహనాన్ని ఎవరూ ఎక్కరాదని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో ఎర్రగుంట్ల ప్రాంతంలో అరెస్టు అయిన నిందితుడిని వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని పరిసర ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతున్న బాలదాసరి యువరాజు అనే వ్యక్తిని పోట్లదుర్తి, ప్రొద్దుటూరు రోడ్డులో ఎర్రగుంట్ల సీఐతోపాటు సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రయాణం చేసేవారు తెలియని వారి వాహనాన్ని ఒకవేళ ఎక్కినా అందుకు సంబంధించిన వాహనం నంబరు తీసుకోవాలన్నారు. పట్టుబడిన బాలదాసరి యువరాజు మైదుకూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందినవాడు. నిందితుడు ఎర్రగుంట్ల ప్రాంతంలో పోట్లదుర్తి సమీపంలో ఓ వ్యక్తి కాలిన గాయాలకు మందు రాస్తుంటాడన్నారు. ఆయనతో మాయమాటలు చెప్పి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ నంబరు తీసుకుని వెళ్లిపోయి తర్వాత ఆ వ్యక్తికి ఫోన్ చేసి మందు రాయాలని తానే ద్విచక్ర వాహనంలో తీసుకెళతానని చెప్పి ఆ వృద్ధుడిని తీసుకెళతాడన్నారు. దారిలో నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లి బెదిరించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, బంగారు రింగు లాక్కున్నాడన్నారు. ఈ వ్యక్తిని ఎర్రగుంట్ల పోలీసు టీం సీఐ నరేష్‌బాబు, ట్రైనీ డీఎస్పీ భవానీ, సిబ్బంది పట్టుకున్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

- ఏఐటీయూసీ

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కడప నగరంలోని చిలకలబావి వద్ద ఉన్న ఏఐటీయూసీ ఆఫీసులో నిర్వహించారు. ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చి దాదాపుగా ఏడు నెలలు గడిచిపోయినా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రతినెలా మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నా రాష్ట్రంలో 50లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ ప్రయోజనాల కోసం ఒక నిర్ణయం కూడా తీసుకోకపోవడం దారుణమన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి దాదాపుగా 42 వేల క్లైయిమ్స్ పెండింగ్‌లో ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ఉండాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు శివశంకర్‌రెడ్డి



బంగారు పతకాలు సాధించిన శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో మార్చి 4 నుంచి 9 వరకూ జరుగనున్న జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతపురం పీటీసీ మైదానంలో ఈనెల 7 నుంచి 9 వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 45+ వయస్సు విభాగంలో హైజంప్,లాంగ్ జంప్ విభాగాల్లో శివశంకర్‌రెడ్డి రెండు బంగారు పతకాలు, ట్రిపుల్ జంప్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు వెల్లడించారు. కాగా రోజూ విద్యార్థులతో పాటు తాను కూడా సాధన చేయడం వలన పతకాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఐదు పదుల వయసులో సైతం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించడం సులువే అన్నారు. ప్రధానంగా చక్కటి ప్రణాళిక, కఠిన శ్రమ, అంకితభావంతో ముందడుగు సాగితే విజయం సాధ్యమౌతుందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన సన్ని

చిన్నమండెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న మండలంలోని దేవగుడిపల్లెకు చెందిన పి.సన్నీ (17) ఆదివారం మృతి చెందాడు. కడప-బెంగళూరు జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సన్నీని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

12 తులాల బంగారం స్వాధీనం

- నిందితుడి అరెస్టు
- 12 గంటలలోపు కేసును ఛేదించిన పోలీసులు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భావన, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున ఇంటి బయట పనిచేసుకుంటున్న ఓ మహిళను చంపుతానని బెదిరించి ఆమె వద్ద ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలతో ఓ వ్యక్తి పరారీ అయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రెండు టీంలుగా ఏర్పడి, సీసీ కెమెరాల సహాయంతో పలు ప్రాంతాల్లో గాలించి, నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ భావన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో నివాసం ఉంటున్న తుమ్మలపెంట సుబ్బయ్య భార్య ప్రభావతి ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద పనిచేసుకుంటుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తలకు మంకీ క్యాపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆమెను చంపుతానని బెదిరించి బంగారు తాళిబొట్టు సరడు, నాలుగు బంగారు గాజులను అపహరించి ద్విచక్ర వాహనంలో పరారీ అయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఉదయం కేసు నమోదు అయింది. సంఘటన అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో టుటౌన్ సీఐ ఎం. యుగంధర్, ఎస్ఐలు జే. ధనుంజయుడు, ఆర్. రాఘవేంద్రారెడ్డి రెండు గ్రూపులుగా ఏర్పడి నిందితుని కోసం పలు కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో టుటౌన్ బైపాస్ రోడ్డులోని మానస రెస్టారెంట్ పక్కనగల మారుతీ అపార్టుమెంట్‌కు వెళ్లే దారిలో స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఉచ్చుగారి రసూల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద ప్రభావతి నుంచి అపహరించిన మొత్తం 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని బజాజ్ డిస్కవరీ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.10 లక్షలు అవుతుందని వివరించారు.

కక్ష సాధింపుకోసమే నేరం

బాధితురాలు ప్రభావతి భర్త సుబ్బయ్య స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద నిందితుడు రసూల్ రెండు సంవత్సరాలుగా గుమస్తాగా పనిచేస్తున్నాడు. రసూల్ తన ముక్కుకు ఆపరేషన్ చేయించుకునేందుకు జనవరి 1వ తేదీ నుంచి గుమస్తా పనికి రాలేదు. డిసెంబరు నెల జీతంతో పాటు ఆపరేషన్‌కోసం అదనంగా రూ.10 వేలు ఇవ్వమని యజమానిని అడిగాడు. దీంతో యజమాని సుబ్బయ్య ఆపరేషన్ చేయించుకుని రాపో తర్వాత ఇస్తానని చెప్పగా.. శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత రసూల్ తనకు రావాల్సిన జీతం అడిగాడు. దీంతో యజమాని తర్వాత ఇస్తాననంటూ వాయిదాలు వేస్తూ వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో



ఎలాగైనా సుబ్బయ్యను ఇబ్బంది పెట్టాలని నిర్ణయించుకుని ఆదివారం తెల్లవారుజామున సుబ్బయ్య తన కిరాణా షాపు వద్ద ఉండగా చూసి ఎవరూ గుర్తు పట్టకుండా మంకీ క్యాంపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆయన ఇంటి వద్దకు వెళ్లి అతని భార్య ప్రభావతిని బెదిరించి బంగారు ఆభరణాలను అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకుని కేసును ఛేదించిన సంఘటనలో టుటౌన్ సీఐ ఎం.యుగంధర్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి, కానిస్టేబుళ్లు ఎం. రవీంద్రనాయక్, బి.మహబూబ్‌బాష, వి.బాబాఫక్రుద్దీన్‌ను డీఎస్పీ అభినందించారు.

జైమిని భారతం గ్రంథావిష్కరణ

కడప కల్చరల్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం మహాసభల్లో పుత్తా పుల్లారెడ్డి రచించిన జైమిని భారతం, శ్రీ లలితానదినీ వ్యాఖ్య గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించగా పుత్తా (బత్తిన) లలిత గ్రంథాన్ని స్వీకరించారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ జైమిని భారతం -శ్రీ లలితా నందిని వ్యాఖ్య అనే బృహత్ గ్రంథాన్ని రూపొందించిన పుత్తా పుల్లారెడ్డి అభినందనీయులన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు రామసూర్యనారాయణ, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, పుత్తా పుల్లారెడ్డి కుటుంబ సభ్యులు, పలువురు సాహితీవేత్తలు, వైద్యులు, సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనర్లకు మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు రావాల్సిన 11వ పీఆర్సీ కరవు భత్యం బకాయిలను చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు చెల్లించాల్సిన రూ.25వేలకోట్ల బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్‌ఆద్మీ' పరాజయానికి అవినీతే మూలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదినేని రామసుబ్బయ్య



చెన్నూరులో మాట్లాడుతున్న బీజేపీ నేత మాదినేని రామసుబ్బయ్య

చెన్నూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఆమ్‌ఆద్మీ' పరాజయానికి అవినీతే మూలమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మాదినేని రామసుబ్బయ్య అన్నారు. చెన్నూరులో ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీని పరిపాలిస్తామని 'ఇండియా ఎగైనెస్ట్ కరెప్షన్' నినాదంతో పదేళ్ల కిందట దేశ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సామాజిక పార్టీ అదే అవినీతితో పరాజయం పొందడం చూస్తుంటే ఆ పార్టీ ఏ మాత్రం అవినీతికి పాల్పడిందో స్పష్టమవుతోందన్నారు. కాలుష్యంలో ఢిల్లీ ఉంటే దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, అక్కడ నివశించాలంటేనే ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితికి వచ్చారన్నారు. కేంద్రంతో సఖ్యత లేకుండా సమన్వయంతో ఢిల్లీని అభివృద్ధి చేసుకోవాలన్న ఆరాటం, తపన లేకుండా నిరంతరం ఘర్షణ పడడంతో ఆ పార్టీని ఘోరపరాజయం దిశగా నడిపిందన్నారు. నిజాయితీపరుడు అని బీరాలు పలికిన కేజ్రీవాల్ సైతం అవినీతిలో కూరుకుపోయి నేడు ఢిల్లీ ప్రజల దృష్టిలో ఎందుకూ పనికిరాకుండా పోయారన్నారు. ముఖ్యంగా గాంధేయవాదులైన అన్నాహజారే, ప్రశాంత్‌కిశన్, యోగీంద్ర యాదవ్ వంటి మేధావులు సైతం పార్టీకిదూరం కావడం కాంగ్రెస్ పార్టీ ఓట్లను కొల్లగొడతామని ఒంటరిగా పోటీ చేసుకోవడం అది కూడా ఆపార్టీ ఎన్నికల్లో బొక్కబోర్లా పడేలా చేసిందన్నారు. మండల కన్వీనరు గాడి భాస్కర్, మాజీ కన్వీనరు రెడ్డిప్రసాద్, సీనియర్ నాయకులు మునిసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామలక్ష్మణ్‌రెడ్డి, శివరామిరెడ్డి, గాడి రమణ, మహిళా నేత పెడబల్లి సరోజనమ్మ పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయ అధ్యక్షుడిగా కళ్యా సుధాకర్ ఏకగ్రీవం

కడప కల్చరల్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): నగర యర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయ అధ్యక్షుడిగా కళ్యా సుధాకర్ నియమితులయ్యారు. 24 ఏళ్లగా ఆలయ అధ్యక్షుడిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికవుతూ అమ్మవారి సేవలో తరిస్తున్నారు. ఆదివారం లక్ష్మయ్య కాంపౌండ్ ఆవరణలో కళ్యా సుధాకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో ఆలయ నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా టేకూరి పుష్పాంగధ, కోశాధికారిగా ఇడెం మల్లికార్జున, తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఆప్కాస్ రద్దుచేస్తే ఆందోళనలు తప్పవు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ విధానం రద్దుచేస్తే ఆందోళనలు తప్పవని ఏపీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) గౌరవాధ్యక్షుడు కేసీబాదుల్లా హెచ్చరించారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేస్తున్న కూటమి ప్రభుత్వం దానికంటే మెరుగైన విధానాన్ని తీసుకురావాలి, లేకుంటే ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగులు అందరితో కలిసి ఆందోళన బాట పట్టాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తారని, ఆప్కాస్ రద్దు చేస్తే మెరుగైన విధానాన్ని తీసుకొచ్చి ఆయా శాఖలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఆరోగ్యభద్రత సీఎం సహాయనిధి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య భద్రత సీఎం సహాయనిధి అని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి అన్నారు. స్వగృహంలో లబ్ధిదారులకు రూ.12,73,438లు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వివేకానందరెడ్డి యాదవ్(పెద్దరంగాపురం) రూ.1,06,901, చిన్నపల్లి నారాయణ(ప్రశాంతినగర్) రూ.3లక్షలు, ఆవుల మహేశ్‌బాబు (వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె) రూ.1,07,682, డక్కా మునీంద్ర (వేంపల్లె)కు రూ.1,05,425, మన్నేరు నాగమునికి రూ.76వేలు. ఎల్లారెడ్డిగారి వీరారెడ్డి(తొండూరు మండలం మడూరు) రూ.40వేలు, నరెడ్డి రామాంజనేయరెడ్డికి రూ.94,957, చిత్రనాగలింగం(లింగాల మండలం పెద్దకుడాల) రూ.81,662, కొప్పర్తి వెంకటకొండారెడ్డి(చక్రాయపేట మండలం మహదేవపల్లి) రూ.1,80,0246, వెంకటరెడ్డి రూ.1,33,600, సుంకిరెడ్డి ప్రసాద్‌రెడ్డికి రూ.46,965 చెక్కులను ఆమె అందించారు.

'అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశ సహజ సంపదను కొల్లగొడుతూ కోట్ల రూపాయలను దోచుకుంటున్న వైసీపీ నేత లింగాల రామలింగారెడ్డి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేముల మండలం వేల్పులలో వైసీపీ నేత రామలింగారెడ్డి 2019లో కొంత భూమిని లీజుకు తీసుకుని టిఫిన్ బైరైటీస్ మైనింగ్ భూమిలో సుమారు రూ.200 కోట్ల విలువైన ముగ్గురాయిని అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు పరిధిలో వున్న ఆ బైరైటీస్‌లో సంక్రాంతి పర్వదినం రోజునే సుమారు 2 వేల టన్నుల మైనింగ్‌ను అక్రమంగా తరలించారన్నారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, ఆర్‌డీఓ, ఎంఆర్‌ఓ, మైనింగ్ ఏడీల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట కూటమి నేతలతో కలిసి ఆందోళనకు సిద్ధం అన్నారు. బీజేవైఎం రాష్ట్ర నేతలు పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, అశోక్‌కుమార్, ప్రవీణ్ నాయుడు, బీజేపీ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో మదనపల్లెకు చెందిన సూర్య డ్యాన్స్ అకాడమీ బృందం నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సాగిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకోవడంతో ఈలలు, కేకలతో ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

కడప శిల్పారామంలో....

కడప కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆట విడుపులో భాగంగా ఆదివారం నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై ఆటా...పాటా... అదుర్స్ అనే లెవెల్లో సాగాయి. పరిపాలనాధికారి పర్యవేక్షణలో మిస్పా మూవీ సహకారంతో పులివెందుల నగరానికి చెందిన ఎస్.కె. డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పల్లె, జానపద, సినీ నృత్యాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం

సికెదిన్నె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని మండల ప్రత్యేక అధికారి చాంద్‌బాష తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, వారి శాఖల్లో సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యుత్తు సమస్యపై సభ దృష్టికి తెచ్చారు. సమస్యను పరిశీలిస్తామని మండల విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు. మండలానికి 11 మోడల్ స్కూళ్లు వచ్చినట్లు ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, రమాదేవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ స్వాధీనం

వేంపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): పర్మిట్లు లేకుండా పాములూరు గుట్ట వద్ద మట్టిని తరలించేందుకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను మైనింగ్, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఏడీ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టగా అక్రమంగా మట్టిని తరలించేందుకు సిద్దమైనట్లు గుర్తించి ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

'ఔట్‌సోర్సింగ్' సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ కడప జోనల్ గౌరవాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కడప ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన జీతాల ప్రకారం కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లేబర్ యాక్ట్ ప్రకారం రావాల్సిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు సక్రమంగా కట్టడం లేదన్నారు. 8 గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ కార్డులు కాంట్రాక్టర్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీపీటీడీ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

మండల వ్యవసాయాధికారి సరస్వతి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తామని మండల వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు మంజూరు చేస్తుందన్నారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత భూమి గల ప్రతి రైతుకూ కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అన్నారు. ఈ సంఖ్య అర్హులైన భూమి గల రైతులను గుర్తించడంలో తోడ్పడి వారికి ప్రభుత్వం నుంచి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు.

జూదరులు అరెస్టు

వేంపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చింతలమడుగు పరిధిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. వారి నుంచి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

వేంపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందించారు. భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఇటీవల భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అధికారులను కోరగా వారు కార్మికులకు అందించారు.

అపూర్వం..... పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడప కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనం మధుర జ్ఞాపకం. నాటి అల్లరి చేష్టలు, తోటి మిత్రులతో కలిసి తిరుగాడిన ప్రదేశాలను మరో గుర్తు జ్ఞాపకం చేసుకుని ఆమధుర క్షణాలను నెమరేసుకున్నారు. వారంతా 30 ఏళ్ల కిందట గాంధీనగర్ మునిసిపల్ స్కూల్‌లో టెన్త్ చదివిన విద్యార్థులు. అప్పట్లో పాఠశాల కెళ్లిన మధుర క్షణాలను మరోసారి నెమరు వేసుకున్న తీరు నిజంగా అపూర్వమే. చిన్నపిల్లలుగా బాల్య దశలో చేసిన తోటి విద్యార్థులతో సాగించిన చిలిపి.. అల్లరిని గుర్తుకుతెచ్చుకుని మరోసారి చిన్నపిల్లలుగా మారిన రోజు. ఆదివారం స్థానిక గాంధీనగర్ మునిసిపల్ స్కూల్‌లో 1994-95 విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి విద్యార్థులంతా ఏకమై అప్పట్లో అక్కడ గంతులేసిన, తిరుగాడిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆప్యాయంగా పలకరించి వారిని మనసారా సత్కరించారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

విశ్వ ల్యాపరోస్కోపి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభం


ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్యపరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డు సూపర్‌బజార్ రోడ్డు ఎదురుగా ఏర్పాటు చేసిన విశ్వ లాప్యరోస్కోపి అండ్ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరు గురించి ఎమ్మెల్యే వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ జంట నగరాలకు పోకుండా గైనకాలజీకి సంబంధించి ల్యాపరోస్కోపి సేవలను తమ ఆస్పత్రిలో అందిస్తున్నామన్నారు. ఇన్‌ఫెర్టిలిటీకి సంబంధించి స్త్రీ, పురుషులకు అవసరమైన సేవలు అందిస్తామని తెలిపారు. మహిళలకు క్యాన్సర్, పెద్ద పెద్ద గడ్డలకు స్పెషలిస్టు డాక్టర్లను పిలిపించి వైద్యం అందజేస్తామన్నారు. కార్డియాలజీ సర్జన్ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ గుండెకు సంబంధించి అన్ని చికిత్సలను తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేసి ఉర్దూ విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్‌ను తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా కోరారు. ఆదివారం నెల్లూరు జిల్లా ఆత్మకూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వెళుతున్న మంత్రి ఎండీ ఫరూక్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ స్వగృహానికి వచ్చారు. కార్యక్రమంలో అబ్దుల్‌సలాం, రఫీ, పూలబాషా తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రజల బాగోగులు చూస్తాం

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


మీర్జఖాన్‌పల్లెలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

దువ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా ప్రజల బాగోగులు చూస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. దువ్వూరు మండలం మీర్జఖాన్ పల్లెలో ఆదివారం వెయ్యి లీటర్ల కెపాసిటీ గల వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కోనేటి హరినాథ్, నాయకులు రాంబాబు, వెంకటసుబ్బయ్య, రఘునాథనాయుడు, ఆశీర్వాదం, లక్షుమయ్యయాదవ్, తాహీర్‌హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం జీవోను విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్టైఫండ్ పెంచాలని పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన న్యాయమైన డిమాండ్‌లపై మౌఖిక ఆదేశాలు కాకుండా ప్రభుత్వం జీవోను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు కూడా స్టైఫండ్‌ను పెంచాలన్న డిమాండ్‌తో గత వారం రోజులుగా చేపట్టిన సమ్మెను ఆదివారం కూడా కొనసాగింది. విద్యార్థులు కళాశాల ఆవరణంలో బైఠాయించి నిరసన తెలిపారు. లిఖితపూర్వక హామీ అందే వరకూ తాము చేస్తున్న నిరసనను విరమించబోమని స్పష్టం చేశారు.

అద్దెభవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగేదెన్నడు..? ● విద్యార్థులకు తిప్పలు తప్పేదెప్పుడు..?


రంగసముద్రం ఎస్టీ కాలనీ, పోరుమామిళ్లలోని తంబాబావివీధిలో అద్దెభవనంలో ఉన్న చిన్నారులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల నుంచి అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నా పాలకులు ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఆ భవన నిర్మాణాలు పూర్తి కావడంలేదు. అద్దె భవనాల్లో నిర్వహణ తప్పడం లేదు. అసలు విషయానికి వస్తే గత ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పినా అవి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారినప్పుడల్లా అసంపూర్తిగానే ఉండిపోతున్నాయి తప్ప పూర్తిస్థాయిలో పిల్లలకు భవనాలు ఉండడంలేదు. దీంతో కొందరు రెంటు ఫ్రీ, మరికొందరు అద్దెభవనాల్లో నిర్వహణ కొనసాగిస్తున్నారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాలు పోరు మామిళ్ల ఐసీడీఎస్ పరిధిలోకి వస్తాయి. వీటిలో 87 సొంత భవనాలు ఉండగా, 39 రెంటు ఫ్రీ భవనాలను నడుస్తున్నాయి. మరో 42 అద్దెభవనాల్లో నిర్వహణ కొనసాగుతోంది. మొత్తం మీద 138 ఉండగా 30 మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. గతంలో బిల్డింగులు మంజూరైనా పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో అవి అసంపూర్తిగా ఉండిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలకు కూటమి ప్రభుత్వంలో అయినా మరికొన్ని నిధులు కేటాయిస్తే అవి పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ ఐసీడీఎస్ పరిధిలో 549 మంది గర్భిణులు, 639 మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అందులో ఈ అంగన్వాడీ కేంద్రాలకు 27 ఇంకుడు గుంతలు కూడా మంజూరై 26 పూర్తయ్యాయి. అంతేకాక మరుగుదొడ్లు కూడా మంజూరయ్యాయి. వారికి ఒక్కో బాత్‌రూంకు సంబంధించి రూ.25వేలు నిధులు మంజూరయ్యాయి. ఈ చిన్నవాటికి నిధులు మంజూరు చేస్తున్నారే కానీ అసంపూర్తిగా ఉన్న భవనాలకు నిర్మాణానికి కూడా నోచుకోని భవనా లకు నిధులు కేటాయిస్తే పిల్లలు పూర్తిస్థాయిలో సొంత భవనాల్లోనే అంగన్వాడీ టీచర్లకు నిర్వహిం చుకునే బాధ్యత ఉంటుంది.

ఈ విషయమై సీడీపీవో లక్ష్మీదేవిని వివరణ కోరగా, ప్రస్తుతం నిధులు మంజూరైతే అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి అధికారులకు నివేదికలు కూడా పంపామన్నారు.

12న మాతంగా మహర్షి సంత్ రవిదాస్ జయంతి

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో ఈ నెల 12వ తేదీన ఆది జాంబవంతుని విగ్రహ ప్రాంగణంలో మాతంగా మహర్షి సంత్ రవిదాస్ జయంతిని నిర్వహిస్తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చర్మ డప్పు కళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, బాలలక్ష్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహానికి నిప్పు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్దనున్న వైఎస్ఆర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరాముల ఓబులేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసు స్టేషన్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ రఫి సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలో సోములవారిపల్లె గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పేకాట సమాచారం అందుకున్న ఎస్ఐ మహమ్మద్‌రఫి సిబ్బందితో కలిసి దాడి చేసి నీలాకరం లాజర్ అనే వ్యక్తితోపాటు మరో అయిదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.22,460ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న రెండు వేర్వేరు సంఘటనల్లో మొత్తం 60 సీసాలను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపుల నిర్వహణపై సమాచారం అందుకున్న రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ మహ్మద్‌రఫి సిబ్బందితో కలిసి మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో మూళ్ల సుబ్బరాయుడు అనే వ్యక్తి వద్ద నుంచి 20,అదే గ్రామంలో మిద్దె లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయ హుండీ చోరీ

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోములవారిపల్లె గ్రామ పొలిమేరలో ఉన్న గంగమ్మ గుడి హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మైదుకూరురోడ్డు జాతీయ రహదారిలో అన్నాక్యాంటీన్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనం ఢీ కొనడంతో వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి కాలు విరిగింది. ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడు వెంకటేశ్వర్లు హోటల్‌లో కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. ఆదివారం పనులు ముగించుకొని తిరిగి ఇంటివెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీ కొని కాలు విరగడంతో స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు

వాటర్‌షెడ్డు యాత్రపై అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల చేపట్టిన గ్రామాల అభివృద్ధి కోసం వాటర్‌షెడ్డు ద్వారా అమలయ్యే పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి వాటిపై అవగాహన కలిగించేందుకు ఆదివారం పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో అవగాహన సదస్సును వాటర్‌షెడ్డు అధికారులు వీవో వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, వాటర్‌షెడ్డు చైర్మన్ రాజారెడ్డి, టీడీపీ నేతలు సాంబశివారెడ్డి, పూజా శివయ్య, మేకల సుధాకర్, గంగరాజు, నాగరాజు, దుగ్గిరెడ్డి, బుజ్జి, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో బహుమతి పొందిన దీప్తిక



కొండాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో కొండాపురం వివేకానంద స్కూల్‌కు చెందిన 2వతరగతి విద్యార్థి ఎస్.దీప్తిక రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి గెలుచుకుంది. తమ విద్యార్థి స్టార్ జూనియర్ లెవల్-2 విభాగంలో రెండో బహుమతి గెలుచుకున్నట్లు కరస్పాండెంట్ బి.లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈనెల 2 తేదీన కడపలో జరిగిన పోటీలలో ఈ విద్యార్థి జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యింది.

భక్తిమార్గాన్ని అనుసరించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు భక్తిమార్గాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గరికపాటి గురజాడ పేర్కొన్నారు. అమ్మవారిశాలలో శతకపద్య మకరందం, శ్రీకాళహస్తీశ్వర శతకం, దాశరధి శతకం, శతకపద్య పరమార్థాలు అన్న అంశాలపై మూడు రోజులపాటు ప్రవచనాలు నిర్వహించారు. ఆదివారం చివరి రోజు ఆయన మాట్లాడుతూ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గరికపాటి గురజాడను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుపై సంబరాలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ గెలుపుతో దేశ ప్రజలందరూ ప్రధాని మోదీ వైపు మొగ్గు చూపి అవినీతి ఆమ్ ఆద్మీ పార్టీనే గద్దెదింపి న్యాయాన్ని గెలిపించారని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పవన్‌కుమార్ అన్నారు. దేశంలో బీజేపీ పాలన లేని కొన్ని రాష్ట్రాలున్నాయని రాబోవు ఎన్నికల్లో ప్రధాని మోదీ పాలన పట్ల ఆకర్శితులై ఆయా రాష్ట్రాల్లో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని నెలకొల్పి దేశం మొత్తం కాషామయమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణయ్య, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపురం..: ఢిల్లీ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కూడా వారు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇరగం రమణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మేకల బాలనాగిరెడ్డి, చామలశివరామిరెడ్డి(బాబు), నాగేశ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి

● ఉత్సాహంగా సాగిన 3, 5కే పరుగు పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కొవ్వూరు గ్రాండ్ ఆధ్వర్యంలో రన్‌ఫర్ లైఫ్ పేరుతో పరుగు పందెం పోటీలు నిర్వహించారు. జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీ వద్ద నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు, విద్యార్థులు, ప్రజలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జెండా ఊపి పరుగు పందెం పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొవ్వూరు రమేష్‌రెడ్డి రెండుసార్లు అవయవ దానం స్వీకరించి పునర్జన్మ పొందారని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు గ్రాండ్ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి, కొవ్వూరు బ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్ కొవ్వూరు సురేంద్రారెడ్డి, కొవ్వూరు జయమ్మ, వీరేంధర్‌రెడ్డి, సాధు గోపాలకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అహమర్‌బాష, రమణయ్య, మురళి, నటకల సతీష్, ఆర్‌సీపీఈ వ్యాయామ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం

బి.కోడూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోంది. మండలానికి 23 పనులకు గాను ఒక కోటీ 82 లక్షల రూపాయల నిధులు సీసీరోడ్లకు మంజూరయ్యాయి.యుద్ధప్రాతిపదికన అవి పూర్తి చేశారని ఎంపీడీవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షులు మాధవరెడ్డి శేఖర్‌రెడ్డి మండల స్థాయిఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, అసంఘటిత కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని వివేకానంద భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రైవేటు ఎలక్ట్రిషియన్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఎలక్ట్రిషియన్ వర్కర్స్ కన్వీనరు మాబువలి, కిరణ్‌బాషా, హుసేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి పలు సమస్యలు


బద్వేలు టీడీపీ కార్యాలయంలో మంత్రులను కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్ కుమార్‌రెడ్డి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సి మంత్రి సవిత, ఎండీ ఫరూఖ్‌ల దృష్టికి నియోజకవర్గ సమస్యలను మాజీఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి తీసుకువెళ్లారు. ఆదివారం ఆత్మకూరుకు వెళుతూ బద్వేలు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డిను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కూటమి నేత బొజ్జ రోశన్న, టీడీపీ నాయకులు కనుమర్లపూటి రామచంద్రప్రసాద్, ఎల్ఎస్‌పీడ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి, సుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాది ప్రసాద్, జీవీ సుబ్బారెడ్డి, కౌన్సిలర్ సునీత, మిత్తికాయల రమణ, మాచుపల్లె లక్ష్మీదేవి, బిగ్‌బాస్, క్రిష్ణారెడ్డి, జహంగీర్‌బాష, నరసింహానాయుడు, ఏపీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై ఇటీవల సిమెంటు రోడ్లు, గోకులాల బిల్లుల గురించి ఇన్‌చార్జి మంత్రి సవితకు రితీష్‌రెడ్డితో పాటు మండల టీడీపీ నాయకులు ఆయన నివాసంలో ఆదివారం కలిసి విన్నవించారు. నెల్లూరుకు పోయే మంత్రి సవిత మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకులు రితీష్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి, అమర్‌నాథరెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, రెడ్డయ్య, జయక్రిష్ణారెడ్డి, విష్ణువర్ధనరెడ్డి పాల్గొన్నారు.

బి.కోడూరు..: బి.కోడూరు మండలంలోని భూ సమస్యలన్నీ ఉన్నతాధికారులతో మాట్లాడి, పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జ్ మినిస్టరు సవిత పేర్కొ న్నారు. ఆదివారం ఆమె నెల్లూరుకు వెళుతూ బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఇంటికి రావడం జరిగింది. అది తెలుసుకున్న మండలంలోని తిప్పరాజుపల్లె, పాయలకుంట్ల రైతులు తమ సమస్యలను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. బద్వేలు ఇన్‌ఛార్జ్ రితీష్ కుమార్‌రెడ్డితో పాటు మండల టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బరామయ్య, రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

● కేంద్రాలు 78 - విద్యార్థులు 14,508

● ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పర్యవేక్షణలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ నేరుగా జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు అనుసంధానమై ఉంటాయని, ఉన్నత స్థాయిలో నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. 19వ తేదీ వరకు షెడ్యూల్ ఉంది. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాగా జనరల్ 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 14508 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

సొంత కళాశాలల్లోనే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలులో లేదు. మూడేళ్ల కిందటే తొలగించారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు రాస్తారు. తక్కువ విద్యార్థులున్న కళాశాలలను సమీపంలోని వాటితో కలిపి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఐఓ కన్వీనరుగా డీఈసీ కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, ప్రత్యేకాధికారిగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పర్యవేక్షించనున్నారన్నారు.

గంట ముందుగా ప్రశ్నపత్రం

ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షణాధికారికి గంట ముందుగా ప్రశ్నపత్రం బోర్డు నుంచి వస్తుంది. డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసి విద్యార్థులకు అందిస్తారు. ప్రయోగ పరీక్ష 30 మార్కులకు ఉంటుంది. ఇందులో విద్యార్థికి 11 మార్కులు (35 శాతం) రావాలి. కేంద్రానికో సీఎస్‌ను ఇప్పటికే నియమించారు. జనరల్ పరీక్షలకు సబ్జెక్టు ఎగ్జామినర్లకు సీనియారిటీ ప్రాతిపదికన బోర్డు నుంచి నేరుగా ఉత్తర్వులు వస్తాయి. కేంద్రాల్లో ప్రతి విడతకు సీఎస్‌లు, మూడు రోజులకోసారి ఎగ్జామినర్లను మార్పు చేస్తారు.

'కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి'

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏఐటీయూసీ ఆఫీసులో నిర్వహించారు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చి దాదాపుగా ఏడు నెలలు గడిచిపోయినా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రతినెలా మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నా రాష్ట్రంలో 50లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ ప్రయోజనాల కోసం ఒక నిర్ణయం కూడా తీసుకోకపోవడం దారుణమన్నారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన శివశంకర్‌రెడ్డి



విజేతగా రెండు బంగారు పతకాలు సాధించిన శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో మార్చి 4 నుంచి 9 వరకూ జరుగనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతపురం పీటీసీ మైదానంలో ఈనెల 7 నుంచి 9 వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 45+ వయస్సులో హైజంప్,లాంగ్ జంప్ విభాగాల్లో శివశంకర్‌రెడ్డి రెండు బంగారు పతకాలు, ట్రిపుల్ జంప్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు వెల్లడించారు. కాగా రోజూ విద్యార్థులతో పాటు తాను కూడా సాధన చేయడంతో పతకాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఐదు పదుల వయసులో సైతం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించడం సులువే అన్నారు. ప్రధానంగా చక్కటి ప్రణాళిక, కఠిన శ్రమ, అంకితభావంతో ముందడుగు సాగితే విజయం సాధ్యమౌతుందన్నారు.

రహదారుల అభివృద్ధికి తోడ్పడండి

● కేంద్ర సహాయమంత్రిని కోరిన ఎమ్మెల్సీ



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ సమస్యలున్నాయని, వాటి పరిష్కారం కోసం తోడ్పడాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఆదివారం గుంటూరులోని మంత్రి స్వగృహంలో కలిసి పులివెందుల సమస్యల గురించి వివరించి మంత్రిని సత్కరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి

వేంపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యా, ఉద్యోగాల్లో స్థానిక, స్థానికేతరుల కోసం రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించారన్నారు. రాజధాని అమరావతి 3వ జోన్ పరిధిలోకి వస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో విద్యా, ఉద్యోగ అవకాశాలు మిగతా ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంటాయన్నారు. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించిందన్నారు. అక్కడ అన్ని ప్రాంతల వారికి సమాన అవకాశాలు లభించాలంటే రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించడం సమంజసమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాజధాని హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించారన్నారు.

అన్నదాత సుఖీభవ ఎప్పుడు

కూటమి అధికారంలోకి వచ్చే దానికి ప్రధాన కారణమైన అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తారని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తోంది, ఖరీఫ్ సీజన్ అయిపోయింది, రబీ సీజన్ ముగింపు దశకు చేరుకున్నా 20పైసల సాయం చేయలేదని మండిపడ్డారు.

వ్యక్తి అదృశ్యం



కడప క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకులోని ప్రకాశ్‌నగర్ మసీదు వెనక వైపు నివాసం ఉంటున్న సయ్యద్ ఖాదర్‌బాషా (50) ఈ నెల 6వతేదీ నుంచి కనబడడంలేదు. అతని భార్య సయ్యద్ గౌసియా చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుపై ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సయ్యద్‌ఖాదర్‌బాషాకు మతిస్థిమితంలేదని, తన భార్య ఇంట్లో లేని సమయంలో ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపారు. ఆ మేరకు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సయ్యద్‌ఖాదర్ బాషా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు పోలీసుస్టేషన్ సీఐ సెల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 9121100522 అనే నెంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

ఆరోగ్యకర జీవనం ఇవ్వాలి

నేడు నులిపురుగుల నిర్మూలన దినం

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆరోగ్యకర జీవనం ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తారన్నారు. పిల్లలు కౌమారుల్లో నులి పురుగుల సమస్యలను అధిగమించడానికి దేశ వ్యాప్తంగా రెండేళ్లలోపు పిల్లలకు 200 గ్రాములు, 19 ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రలు వేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం తరువాత వేస్తారన్నారు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో వేస్తారని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారికి పట్టువస్త్రాలు

పులివెందుల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి సమేత కల్యాణ వేంకటరమణుడికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తిరుపతి నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారికి గరుడసేవ చేపట్టారు. 30 ఏళ్లగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణలో భాగంగా 12 ఏళ్ల నుంచి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ రోజున తిరుపతి నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతోంది.

మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య



సికెదిన్నె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు పాఠశాలలోనే మందలించడంతో మనస్థాపానికి గురై విద్యార్థి మదన్‌మోహన్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొప్పర్తి వాసి చంద్రశేఖర్ రెడ్డి, వాసవి దంపతుల ఏకైక కుమారుడు మదన్‌మోహన్‌రెడ్డి తాడిగొట్ల పంచాయతీలో ఓ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కాగా ఆదివారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సమయంలో విద్యార్థికి మార్కులు తక్కువగా వచ్చాయని మందలించారు. విషయమై మనస్థాపానికి గురైన విద్యార్థి సాయంత్రం దుప్పటితో ఉరి వేసుకుని మృతిచెందాడు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సికెదిన్నె సీఐ శివశంకర్ నాయక్ పరిశీలించారు. పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని రిమ్స్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో యువకుడు...

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్నపల్లి రోడ్డు రాజారెడ్డికాలనీలోని పార్కు సమీప ఇంట్లో దశరధరామ్‌రెడ్డి (22) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు వివరాల మేరకు.. దశరధరామ్‌రెడ్డి సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తూ తల్లి దగ్గర ఉంటున్నాడు. అతడు అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

వల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పైడికాల్వ గ్రామంలో పాపాఘ్నినది తీరం వద్ద వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేకం నేటి నుంచి మూడురోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణ శర్మ తెలిపారు. వేకువనే సుప్రభాత సేవ అనంతరం గోపూజతో ప్రారంభమై యాగశాల ప్రవేశంతో అంకురార్పణగావిస్తామన్నారు. ప్రధాన కలశాలు స్థాపించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అగ్ని ప్రతిష్ఠ గావించి హోమాలు చేపట్టిన అనంతరం లఘు పూర్ణాహుతి, మహా మంగళ హారతి స్వామివారికి సమర్పించితీర్థ ప్రసాదాలు అందిస్తానన్నారు. రాత్రి తిరుపతి వాస్తవ్యులచే భరత నాట్యం, కూచిపూడిఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృప పొందాలని కోరారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ ఉంటాయన్నారు.

ఉపాధి కల్పించి వలసలు ఆపాలి

వేముల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు కల్పించి వలసలు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) వేముల మండల నేత ఎస్.చాంద్‌బాష డిమాండ్ చేశారు. ఆదివారం వేములలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. పథకంలో నిధులు పక్కదారి పట్టించకుండా కూలీల భద్రత కోసమే వచ్చిన ఈ పథకంలో నిధులన్నీ వారికే కేటాయించాలన్నారు. పని కల్పించకుంటే ఉపాధి భృతిగా రూ.12వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దయ్య, మునీంద్ర, రాధాకృష్ణమూర్తి, సాంబశివారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.